అరుణోదయ జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 05 ఏప్రిల్ 2023
1

రోడ్డు ప్రమాదంలో జర్నలిస్టు మృతి

రామకృష్ణాపూర్ : మందమర్రి పట్టణానికి చెందిన జర్నలిస్టు బొడ్డు రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన మృతికి క్యాతన్‌పల్లి ప్రెస్‌క్లబ్‌లో క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సంతాపం తెలిపారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ బొడ్డు రవి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, కోశాధికారి పరికిపండ్ల రాజు, సంయుక్త కార్యదర్శి పోలుదాసరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు చొప్పదండి తిరుపతి, బొజ్జ అనిల్ పాల్గొన్నారు.



బలగం సినిమా ప్రదర్శన

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని పడ్తన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ గోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బలగం సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. గ్రామ ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి సినిమాను తిలకించారు. పాతకాలంలో వీధుల్లో సినిమాల ప్రదర్శన జరిగేవని, చాలారోజుల తర్వాత బలగం సినిమాతో మళ్లీ సంప్రదాయం మొదలైందని, పల్లె ప్రజలు ముచ్చటించుకుంటున్నారు. కుటుంబ సభ్యుల మధ్య విలువలు, బంధాలపై హత్తుకునేలా సినిమాలో చూపారని గ్రామస్తులు తెలిపారు.



ఉపాధికి దక్కని భరోసా..!

- అవరోధంగా మారుతున్న కేంద్రం నిబంధనలు
- ఆధార్ అనుసంధానంలోనూ తీవ్ర జాప్యం
- సకాలంలో కూలీ డబ్బులు అందక ఇబ్బందులు
- అనేక పల్లెల్లో ప్రారంభం కాని పనులు

నిరుపేదల కడుపు నింపేందుకు అమల్లోకి వచ్చిన ఉపాధిహామీ చట్టం వారికి భరోసానివ్వడం లేదు. కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలు పేద కూలీలకు శరాఘాతంలా మారుతున్నాయి. ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం తీసుకొచ్చిన నూతన విధానం నిరుపేదలకు తంటాలు తెచ్చిపెడుతోంది. ఫలితంగా ఆదిలాబాద్ జిల్లాలో అనేక మంది పేదలు ఉపాధి పనులకు దూరమవుతున్నారు. జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో అనేక మంది కూలీలకు పనులు లభించడం లేదు. జిల్లాలో లక్షకుపైగా మంది కూలీలు ఉండగా కేవలం 22వేల మంది మాత్రమే పనులు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరోపక్క సకాలంలో కూలీ డబ్బులు దరిచేరకపోవడంతో కొందరు కూలీలు ఈ పనుల పట్ల అనాసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఉపాధి పనులు ఇంకా ప్రారంభం కావడం లేదు. పనులు కల్పించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అలసత్వం కారణంగా నిరుపేదలకు ఉపాధి పనులు అందని ద్రాక్షగానే మారుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వేసవిలో వ్యవసాయ పనులు ముగిసిపోవడంతో అనేక మంది గ్రామీణులు ఈ ఉపాధి పనులపైనే ఆధారపడుతుంటారు. అప్పట్లో కేంద్రప్రభుత్వం సైతం ఈ సమయంలో పనులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని నిబంధన ఉంది. కానీ కొందరికే వంద రోజుల పని కల్పిస్తూ చేతులు దులుపుకొంటున్నారు. కేంద్రప్రభుత్వం ఏడాది క్రితం నూతన నిబంధనలు తీసుకొచ్చింది. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఫోటో క్యాప్చర్ చేయడం, జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో చాలా మంది కూలీలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో పనులకు దూరం కావాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. క్షేత్రస్థాయిలో కూలీలకు సరైన అవగాహన లేని కారణంగా ఆధార్ అనుసంధానం చేయించడం లేదు.

కూలీలకు దక్కని భరోసా..!

ప్రభుత్వం ప్రస్తుతం సగటు కూలీ రూ.272 అందజేస్తోంది. జిల్లాలో 1.68లక్షల జాబ్‌కార్డులు ఉండగా 3.37లక్షల మంది ఉపాధిహామీలో నమోదయ్యారు. ప్రస్తుతం యాక్టివ్ జాబ్‌కార్డులు 1.11లక్షలు ఉండగా 2.08లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. కానీ ఈ ఏడాది పనులు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు కేవలం 22వేల మంది మాత్రమే ఈ పనులకు వెళుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా రెండు పూటలా ఫోటోలు తీయడం.. కేవలం రూ.273 మాత్రమే కూలీ దక్కడం అది కూడా సక్రమంగా రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

త్వరలో అందరికీ పనులు కల్పిస్తాం : కిషన్, డీఆర్‌డీఓ, ఆదిలాబాద్

కిందటేడాదికి సంబంధించి కొందరు కూలీలకు వంద రోజులు పని ఇటీవలే పూర్తయింది. దీంతో కూలీల సంఖ్య కొంత తక్కువగా నమోదవుతోంది. రెండు, మూడు రోజుల్లో కూలీల సంఖ్య పెరుగుతుంది. అందరికి వంద రోజుల పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.



చేసిన పనులకు వారాల తరబడి కూలీ డబ్బులు రాకపోవడంతో నిరుపేదలు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ పనులకు వెళ్లేకంటే ఇతర పనులకు వెళ్లడమే శ్రేయస్కరమని భావిస్తున్నారు. ఇది వరకు ప్రతి వారం డబ్బులు వస్తుండటంతో ఈ పనులపై మొగ్గుచూపేవారు. కానీ ప్రస్తుతం కూలీ డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

పల్లెల్లో ప్రారంభం కాని పనులు

జిల్లాలో వ్యవసాయ పనులు ముగిసి నెల రోజులు కావస్తున్నా ఇంకా ఉపాధి పనులు ప్రారంభం కావడం లేదు. ఆయా మండలాల్లో కొన్ని గ్రామాల్లో మాత్రమే ఈ పనులు జరుగుతుండటంతో మిగితా గ్రామాల ప్రజలు ఈ పనుల కోసం ఎదురుచూస్తున్నారు. కిందటేడాది చాలా మందికి వంద రోజుల పని పూర్తికాకపోవడంతో ఈ ఏడాది పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. కాగా ఈ పనుల మీదనే నమ్మకంతో ఉన్న నిరుపేదలకు అధికారుల అలసత్వ వైఖరి అవస్థలకు గురిచేస్తోంది. మరోపక్క కొన్ని గ్రామాల్లో ఇంకా వ్యవసాయ పనులు ఉండటం.. కూలీల కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో కొందరు ఉపాధి సిబ్బందిని తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలున్నాయి.

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు చంద్రశేఖర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ - దహెగాం

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు నోముల చంద్రశేఖర్‌కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈ నెల 9,10వ తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 48 గంటలు నాన్‌స్టాప్‌గా ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఇంత ప్రాముఖ్యత ఉన్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు చంద్రశేఖర్‌కు ఆహ్వానం అందడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాహిత్యం, కవిత్వంలో చంద్రశేఖర్ సేవలను గుర్తించిన శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఆయనను ఆహ్వానించడంతో చంద్రశేఖర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించినందుకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కార్యవర్గ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యశాఖ సంఘ సభ్యులు సమన్వయంతో మెలగాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మత్స్యశాఖ సహకార సంఘ సభ్యులు సమన్వయంతో పనిచేసి ఆర్థికంగా బలపడాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని రౌటసంకెపెల్లి గ్రామంలో మత్స్యశాఖ సహకార సంఘ సభ్యుల మధ్య సంఘానికి సంబంధించి వచ్చిన మనస్పర్ధలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖ సహకార సంఘం అభివృద్ధి చెందేలా సభ్యులు ప్రవర్తించాలని సూచించారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. అనంతరం నూతన డ్వాక్రా గ్రూపులకు సంబంధించి ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మహిళలు డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉంటూ స్వతహగా ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అవసరమైన చేయూత అందిస్తుందని తెలిపారు. నూతన సంఘాల్లో సభ్యులుగా చేరడానికి మహిళలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, వైస్ ఎంపీపీ సుంకరిమంగ పెంటయ్య, గ్రామ సర్పంచ్ విమలకిష్టయ్య, ఐకెపి ఉద్యోగి సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-తాండూర్

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీవో శ్యామలదేవి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం వల్ల మానసిక సంతృప్తి కలుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు జన సమూహాల వద్ద చలివేంద్రాల ఏర్పాటు చేయాలని తెలిపారు. వేసవి దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పరిస్థితుల్లో ప్రజలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఆర్ఐ నిజాముద్దీన్, మురళీధర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అంజన్న, వీఆర్ఏలు పాల్గొన్నారు.

గడువులోగా పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 30లోగా ఆస్థి పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా నల్లా బిల్లులు కూడా సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం నుండి శివకేశవ ఆలయం వరకు హనుమాన్ శోభాయాత్ర మంగళవారం నిర్వహించారు. భాజాభజంత్రీల నడుమ శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ శోభాయాత్రలో హనుమాన్ మాలధారణ స్వాములతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు హన్మాన్ శోభాయాత్ర

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం హన్మాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు బజరంగ్‌దళ్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు స్థానిక బాలభారతి పాఠశాల సమీపంలోని హన్మాన్ మందిర్ నుండి శోభాయాత్ర ప్రారంభమై రాజీవ్ చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి హన్మాన్ మందిర్ వరకు ఈ శోభాయాత్ర సాగుతుందని, అనంతరం బాలభారతి పాఠశాల ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. హన్మాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

రేపు 24 కుండీల గాయత్రి మహాయజ్ఞం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల ఆరో తేదీన కాగజ్‌నగర్ పట్టణం ఎస్పీఎం న్యూకాలనీలోని గాయత్రి శక్తి పీఠంలో 24 కుండీల గాయత్రి మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు గాయత్రి పరివార్ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం ఎనిమిదిన్నరకు గాయత్రి పూజ, 24 కుండీల యజ్ఞం, అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. సాయంత్రం ఆరున్నరకు దీప యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులకు బైజుస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి లాప్‌టాప్, ఆండ్రాయిడ్ మొబైల్ గతంలో అందించామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసించాలని తెలిపారు. ఎంసెట్, జేఈఈ, మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి ఐఐటీ, ఎన్‌ఐటిలలో సీట్లు సాధించే విధంగా విద్యార్థులు నైపుణ్యత సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైజూస్ సంస్థ ప్రతినిధి పి.అభిలాష్, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన జూనియర్ అసిస్టెంట్లకు సన్మానం



నస్పూర్: జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఇంటర్నల్ పరీక్షల్లో భాగంగా పదోన్నతి పొంది వివిధ ఏరియాలకు బదిలీ అయిన 12 మంది జూనియర్ అసిస్టెంట్లను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థలో వారసత్వ ఉద్యోగంలో బదిలీ వర్కర్‌గా చేరి పదోన్నతిలో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా ఎన్నిక కావడం చాలా సంతోషకరమైన విషయమని, ఇలాగే ఇంకా పైస్థాయికి వెళ్లడానికి ప్రయత్నించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, డీజీఎం ఐఈడి చిరంజీవులు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పిఓ ప్రకాష్ రావు, లా ఆఫీసర్ ప్రబంధిత, ఎస్సి లైజనింగ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఎస్సీ అసోసియేషన్ పిట్ సెక్రెటరీ విటేకర్, ఎస్సీ ఎస్టీ ప్రతినిధి గోషిక మల్లేష్, కార్యాలయం మహిళా ప్రతినిధి అఖిల, పూజిత పాల్గొన్నారు. ఎస్ఆర్పి 3,3ఎ గనిలో విధులు నిర్వహించి జూనియర్ అసిస్టెంట్‌గా ఎన్నికైన సందర్భంగా ముగ్గురు ఉద్యోగులను డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో గని అధికారులు సేఫ్టీ ఆఫీసర్ మహేందర్, ఫిట్ ఇంజనీర్ వై. ప్రేం కుమార్, డివైఎస్ఈ కామేశ్వర్‌రావు, వెంటిలేషన్ ఆఫీసర్ అరుణ్ కుమార్, సీనియర్ అండర్ మేనేజర్ రాకేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులలో పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల విద్యా శాఖ జిజ్ఞాస విద్యార్థి ప్రాజెక్టు పోటీలను నిర్వహించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది నిర్వహించిన పోటీలలో బోటనీ, రసాయన శాస్త్రం, ఇంగ్లీషు సబ్జెక్టు అంశాలపై నిర్వహించిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వృక్షశాస్త్ర అధ్యాపకుడు వి దేవేందర్ పర్యవేక్షణలో అటవీ ప్రాంతంలో గిరిజనులు ఉపయోగించే ఔషధ మొక్కలపై, రసాయనశాస్త్ర అధ్యాపకురాలు ఇ శారద పర్యవేక్షణలో సిల్వర్‌నానో పార్టికల్స్ సంశ్లేషణపై, జె ప్రేంకుమార్ పర్యవేక్షణలో నిత్యజీవితంలో ఆంగ్లం ఆవశ్యకతపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీరు త్వరలో హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి రూ. 25 వేల నగదు బహుమతి అందించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం, ఇతర అధ్యాపకులు అభినందించారు.

మెడికల్ కాలేజీ గుడిపేట్‌లోనే ఏర్పాటు చేయాలి

- మంత్రి హరీష్‌రావుకు జడ్పీటీసీ శిల్ప వినతి



నవతెలగాణ -హాజీపూర్

జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీ శాశ్వత భవనాన్ని మండలంలోని గుడిపేటలో నిర్మించాలని జెడ్పీటీసీ పుస్కూరి శిల్పశ్రీనివాసరావు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు సమస్యలపై స్థానిక నాయకులతో కలిసి జెడ్పీటీసీ శిల్ప ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి హరీష్‌రావును కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో మండలంలోని 7గ్రామాలు ముంపునకు గురయ్యాయని, దీంతో చాలా మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఈ ప్రాంతంలో మెడికల్ కాలేజీ నిర్మిస్తే కొంత ఉపాధి లభించనుందని తెలిపారు. ముంపు గ్రామాల్లో ఇంటి నిర్మాణం కింద ఇచ్చే ప్యాకేజీ రూ.70వేలు అందరికి అందేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ వెంట దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్, మల్రాజు రాంగోపాలరావు ఉన్నారు.

అరుదైన లిమ్కా బుక్‌లో ఎమ్మెల్యే జోగు రామన్నకు స్థానం



నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

ఒక గంట వ్యవధిలో అత్యధిక మొక్కలు నాటి రికార్డు సృష్టించిన నేపథ్యంలో ఎమ్మెల్యే జోగు రామన్నకు లిమ్కా బుక్‌లో స్థానం దక్కింది. ఈ మేరకు మంగళవారం సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో ఎమ్మెల్యేకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే జోగు రామన్న పుట్టిన రోజును పురస్కరించుకుని 2021 జూలై 4న స్థానిక దుర్గానగర్‌లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి లిమ్కా బుక్ అఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయుల అపార కృషిని గుర్తించే లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు చోటు లభించింది. విద్యా సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సినిమా, వ్యాపారం, రక్షణ, సామాజిక సేవ వంటి రంగాల్లో అనితరసాధ్యమైన భారతీయుల కృషిని, విజయాలను గుర్తించి 'లిమ్కా బుక్' రికార్డులో చోటు కల్పిస్తుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ అవార్డును సామాజిక సేవా విభాగంలో ఒక గంటలో అత్యధిక మొక్కలు నాటించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌కు రికార్డ్స్‌లో చోటు కల్పించినట్లు లిమ్కాబుక్ రికార్డ్స్ ఎడిటర్ వత్సాల కౌల్ బెనర్జీ తెలిపారు. ఈ మేరకు లిమ్కాబుక్ ప్రశంసా పత్రాన్ని కేసీఆర్ చేతుల మీదుగా సంతోష్ కుమార్‌తో పాటు ఎమ్మెల్యే జోగు రామన్న స్వీకరించారు. గంట సమయంలో 16,900 వందల మంది భాగస్వామ్యంతో 3,54,900 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధి సంజీవ రాఘవ, బీఆర్ఎస్ నాయకులు జోగు మహేందర్, స్వాస్ సంస్థ అధ్యక్షులు కారింగుల ప్రణయ్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కెరమెరి

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుటికెల ఆనంద్‌రావ్ అన్నారు. మంగళవారం ఏపీఎం జగదీశ్వర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఏప్రిల్ 16 వరకు విధులకు హాజరు కాబోమన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పనులను బహిష్కరిస్తామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి కొన్నేళ్లుగా ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి 8 ఏళ్లు దాటినా వీఓఏల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఓఏలకు సెర్ప్ నుండి కేవలం రూ.3900 గౌరవ వేతనం మాత్రమే చెలిస్తూ శ్రమ దోపిడీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26000 చెల్లించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఏప్రిల్ 17 నుండి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందిర, సుజాత, లక్ష్మీ, శారద, రమేష్, ధర్మారావు రాజేష్, యాదవ్ షా, రఘునాథ్, పార్వతి, భీంరావు పాల్గొన్నారు.

వృత్తి విద్య నైపుణ్యాల ద్వారా లబ్ది పొందాలి



నవతెలంగాణ-తాండూర్

సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్య నైపుణ్య శిక్షణ తరగతులను వినియోగించుకొని లబ్ది పొందాలని బెల్లంపల్లి ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు స్వరూపరాణి దేవేందర్ అన్నారు. ఆమె మంగళవారం మాదారంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. యువతులు కుట్టిన డ్రెస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి సంస్థ అందిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు సేవాసమితి ఆధ్వర్యంలో జూట్ బ్యాగులు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్ శిక్షణలు ఇప్పిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయ్యే లోపు ప్రతి ఒక్కరు స్వతహాగా డ్రెస్సులు కుట్టే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. పెద్దవాగు ఒడ్డున గల కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షపరులకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం స్వాములకు స్వయంగా వడ్డించారు. అంతకుముందు ఆలయంలో పూజారి శిరీష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, గుండా వెంకన్న, మురళిగౌడ్, అంజనేయులుగౌడ్, రూప్నర్ రమేష్, వివేక్, బీఆర్ఎస్ నాయకులు చిలువేరు వెంకన్న, గోపాల్ నాయక్, బాపురావు, రామాగౌడ్ పాల్గొన్నారు.

ఖర్జీలో కార్డన్ సెర్చ్

దహెగాం: మండలంలోని ఖర్జీ గ్రామంలో ఎస్ఐ సనత్‌కుమార్ మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోలీసు బలగాలు ఇండ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం ఎస్ఐ సనత్‌కుమార్ మాట్లాడుతూ సంఘ విద్రోహక శక్తులకు అవకాశమివ్వద్దన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపించినట్టయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సహకాలంలో అధికారులు విధులకు హాజరు కావాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్



ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు సహకాలంలో హాజరు కావాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించి, అధికారుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, ఎంపీడీఓ సరోజను విధులకు గైర్హాజరైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రతిరోజు విధులకు హాజరు కావాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని అన్నారు.

కళ్యాణలక్ష్మి పథకం పేదలకు కొండంత అండ

నవతెలంగాణ-ఖానాపూర్



రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి పథకం కొండంత అండగా నిలిచిందని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన రూ.66 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఖానాపూర్ పట్టణంతో పాటు సుర్జాపూర్, పాతఎల్లాపూర్, బీర్నంది, రాజుర గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు ఆడబిడ్డ పెండ్లి బారం కాకూడదని సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో కళ్యాణలక్ష్మి పథకం ప్రవేశ పెట్టారని అన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలని అన్నారు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పదో తరగతి పరీక్షలో తెలుగు పేపర్ లీక్ కావడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నైతిక బాధ్యత వహిస్తూ ఆమెను బర్తరఫ్ చేయాలని ఆదివాసీ మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి అన్నారు. మంగళవారం ఆమె మండలకేంద్రంలో ఆదివాసీ సంఘాలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మొన్న గ్రూప్-1 పేపర్, ఇప్పుడేమో పదో తరగతి పేపర్ లీక్ అయిందని వెల్లడించారు. సోమవారం ఉట్నూర్ కేంద్రంలో పరీక్ష పేపర్లు తీసుకు వెళ్తుండగా మిస్సింగ్ ఎలా అయిందని ప్రశ్నించారు. ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటుందని అన్నారు. విద్యార్థులకు ఈ ప్రభుత్వంపై విశ్వాసం లేదని ఆరోపించారు. పేపర్లు లీక్ అయిన, మిస్సింగ్ చేసిన సంభందిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ నాయకులు జగ్నాక్ భరత్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పుర్క చిత్రు, గేడాం భారత్ పాల్గొన్నారు.

పెన్షనర్ల భవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన పెన్షనర్ల భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే రేఖా నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వ అధికారులకు వారి పదవి కాలం ముగిసిన తర్వాత కూడా వారికి ఆరోగ్య భద్రత కల్పించడం జరిగిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులకు పెన్షనర్స్ యూనియన్ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షులు అజ్మీర శ్యామ్ నాయక్ పాల్గొన్నారు. అనంతరం ఖానాపూర్ పట్టణంలో జంగల్ హనుమాన్ నుండి ఖానాపూర్ పుర వీధుల్లో మంగళవారం భజరంగ్‌దళ్ ఖానాపూర్ అధర్వంలో నిర్వహిస్తున్న హనుమాన్ జయంతి భారీ ర్యాలీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అజ్మీరా రేఖనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందువులు అందరూ సంఘటితం కావాలని అన్నారు.

గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పరిశీలన



నవతెలంగాణ-బేల

మండలంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షేమా దేశ్‌పాండే మంగళవారం పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వంట, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. పని చేయని ఫ్యాన్‌లను బాగుచేయాలనీ ఆదేశించారు. పిల్లలకు ఎలాంటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత పాఠశాల సిబ్బందదని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆమె వెంట బేల గ్రామ సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు జ్యోతి రామ్, వార్డెన్ ప్రియ ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బాసర

మనస్థాపంతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలంలోని మైలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలాపూర్ గ్రామానికి చెందిన నానం సాయిలు(32) భార్య పుట్టింటికి వెళ్లి పోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో మనస్థాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కంగారు ముఖ చిత్రం

కంగారుగా కనిపించే ఈ చిత్రం చూపరులను కంగారు పెడుతోంది. ఈ చిత్రాన్ని వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తన కెమెరాలో బందించాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ అడవుల్లోని లోకారి అటవీ ప్రాంతంలో ఉన్న ఓ చెట్టు కొమ్మ మొద్దు అంచు చివరన కంగారు జంతువు లేచి నిల్చున్నట్లుగా కనిపిస్తోంది. అచ్చం కంగారు ఆకృతిని పోలి ఉన్న ఈ దృశ్యం అద్భుతమని, ఇది ప్రకృతి గీసిన చిత్రమని కృష్ణ పేర్కొన్నారు.

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గందరగోళంగా డబుల్ బెడ్ రూమ్ ఎంపిక ప్రక్రియ

- స్థలం ఇచ్చిన వారికి మొండి చేయి
- బాధితుల రాస్తారోకో అరెస్ట్



నవతెలంగాణ-భైంసా

భైంసాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరులో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మంగళవారం గందరగోళంగా జరిగింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అధికారులు విచారణ చేపట్టి 1030 మందిని అర్హులుగా గుర్తించి, లక్కీడీప్ ద్వారా 440 మందిని ఎంపిక చేశారు. భైంసాలోని న్యూసురులోక గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమం బాధితుల ఆందోళనలతో హోరెత్తింది. అయితే గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి అప్పటి ఇందిరమ్మ లబ్ధిదారులు పునాదులు నిర్మించిన స్థలాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పారు. అప్పట్లో స్థలం ఇచ్చిన వారికి ఇండ్లు మంజూరు చేస్తామని అధికారులు తెలుపగా తీరా మొండి చేయి చూపించడంతో బాధితులు ఆందోళన చేపట్టారు. వీరికి ఇందిరమ్మ బిల్లు మంజూరు అయిందని అధికారులు జాబితా నుంచి తొలగించడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రభుత్వమే వారి పునాదులు కూలగొట్టి స్థలం తీసుకోవడం ఆపై గతంలో మీరు ఇందిరమ్మ లబ్ధిదారులంటూ వారిని ఎంపిక చేయలేదని



పేర్కొన్నారు. దీంతో బాధితుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. న్యూఎస్ఆర్ఆర్ గార్డెన్ ముందు తమకు అన్యాయం జరిగిందని మహిళలు కంటతడి పెట్టి ఆందోళన చేపట్టగా పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఇక లక్కీడిప్ ఎంపిక ప్రక్రియలో అన్యాయం జరిగిందని ఇండ్లు ఉన్నవారికి డబుల్ బెడ్ రూములు మంజూరు చేశారని బాధితులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు రహదారిపై బైఠాయించడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. పట్టణ సీఐ సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించిన వారు శాంతించలేదు. దినమంతా తిండి మానేసి బాధితులు తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ముందు గడిపారు. అధికారులు తమ విచారణలో సరి అయిన అర్హులను గుర్తించలేదని వారు వాపోయారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అదనపు కలెక్టర్ రాంబాబు, జెడ్పీ సీఈఓ సుధీర్‌బాబు, ఆర్డీఓ రవి, అన్ని మండలాల తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీదార్లు పాల్గొన్నారు.



ఆరోగ్య మహిళ గురించి అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా అందించే వైద్య సేవలు, పరీక్షలను గురించి ప్రతి మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే 8 రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమం గురించి ప్రతి మహిళకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యమహిళా కార్యక్రమంలో బాగంగా ప్రతి మంగళవారం ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది అందరూ మహిళలే ఉండేలా చూడాలని అన్నారు. సమస్య తీవ్రతను బట్టి అవసరం ఉన్నవారిని జిల్లా ప్రదాన ఆస్పత్రికి పంపించాలని తెలిపారు. అనంతరం కేంద్రంలో అందించే వైద్య పరీక్షలు, హజరు వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదర్శ



పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీపీ ఆజాడే జయశ్రీ, డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్, ఎంపీడీఓ రాథోడ్ రాధ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల డబ్బుల స్వాహాపై విచారణ జరిపించాలి

నవతెలంగాణ-గుడిహత్నూర్

గుడిహత్నూర్ మండలంలోని చంద్రోదయ మండల సమాఖ్య ఇందిరా క్రాంతి పదం మహిళా సంఘాల నుండి సిబ్బంది డబ్బులు రికవరీ చేసి బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేసిన సంఘటనపై తక్షణమే విచారణ జరిపించాలని గుడిహత్నూర్ సర్పంచ్ జాదవ్ సునీత డిమాండ్ చేశారు. మంగళవారం గుడిహత్నూర్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ భరత్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయా విభాగాల అధికారులు గత మూడునెలల్లో చేపట్టిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి పంచాయతీరాజ్ డీఈ శివరాం మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఎంపీపీ భరత్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని నీటిపారుదలశాఖ ఎఈ ఆదిత్యకు సూచించారు. మండల వైద్యాధికారి శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రసవవానికి వచ్చే గర్భిణులకు వెయిటింగ్ రూం కోసం ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఐటీడీఏ భవనాన్ని కేటాయించేలా చొరవ తీసుకోవాలని ఎంపీపీని



కోరారు. దీంతో పాటు అస్పత్రిలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని దీంతో వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఖాళీగా ఉన్న పోస్టుల వెంటనే భర్తీ చేసేలా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారికి నివేదిస్తామని ఎంపీపీ సమాధానం ఇచ్చారు. ఇందిర క్రాంతి పథం సీసీ యాదవ్ ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రగతి నివేదికను చదివి వినిపించేందుకు రాగా గుడిహత్నూర్ సర్పంచ్ జాదవ్ సునీత అడ్డుకున్నారు. గత కొన్ని నెలల నుండి ఐకేపీ సిబ్బంది కొంతమంది మహిళా సంఘాల వద్ద నుండి రికవరీ చేసిన రుణాలను సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. సుమారు రూ.30లక్షల వరకు మహిళా సంఘాల డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా ఒక విట పక్కదారి పట్టించారని, దీనిపై విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఆర్డిఓకు నివేదికను పంపిస్తామని ఎంపీడీఓ సునీత జవాబిచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం నిర్వహిస్తున్న సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడం పట్ల జెడ్పీటీసీ సభ్యుడు పతంగే బ్రహ్మానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. ఈ సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, సర్పంచ్‌లు జాదవ్ సునీత, ధనలక్ష్మి, ప్రభాకర్, కుమ్ర లింగు, ఎంపీటీసీలు అంకతి సవిత, సగీర్ ఖాన్, కోవ తులసి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచానికి పెను విపత్తుగా మారుతున్న గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించే దిశగా బయో ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్లు మీరా క్లీన్ సంస్థ సీనియర్ నేషనల్ హైమ్ బీడీఎస్ కిషోర్ రాథోడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేయగా బయో ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. సదస్సులో భాగంగా రైతులకు, స్థానికులకు వివిధ అంశాలపై అవగాహనా కల్పించారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ హాజరు కాగా, ఎంసీఎల్ సంస్థ అడ్వైజర్లు ఆంజనేయులు, అదనపు ఎస్పీ రాములు నాయక్, వ్యవసాయ శాఖా అధికారి పుల్లయ్య, కౌన్సిలర్ పవన్ నాయక్, నాయకులు దుర్గం శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ నేషనల్ హైమ్ బీడీఎస్ కిషోర్ రాథోడ్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు ఆసక్తి పెంచేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బయో ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులను ప్రతి తాలూకాలో ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. ఇప్పటికే పద్నాలుగు రాష్ట్రాల్లో నాలుగు వేల ఆరు వందల సీఎన్జీ బుకింగ్‌లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. దేశంలో అరవై అయిదు శాతానికి పైగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, రైతులు ఆర్థికంగా ఎదిగేల ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వివరించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల జీవితాలతో తెలంగాణ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక వైపు టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీకేజీ ఘటన మరువక ముందే ఇప్పుడు పదో తరగతి ప్రశ్నపత్రాలు సోషల్ మీడియాలో రావడం అలాగే సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో పదో తరగతి జవాబు పత్రాలు మాయమువడం పూర్తిగా విద్యాశాఖ నిర్లక్ష్యమని ఆరోపించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తొలి మెట్టైన పదో తరగతి పరీక్ష జవాబు పత్రాలు మిస్సైన ఘటనలో నిర్లక్ష్యం వహించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే దీనికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గటిక క్రాంతి కుమార్, వెంకట్‌రెడ్డి, కాంతారావు, లీలావతి, అనసూయ, రాము, ప్రశాంత్, ముఖీం ఉన్నారు.

గిరిజనుల ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-నిర్మల్

గిరిజనులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో మంజూరైన రూ.44లక్షల విలువైన కాంక్రిట్ మిక్సర్ మెషిన్‌ను మంత్రి గిరిజన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో గిరిజనులకు స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందని అన్నారు. తక్కువ మూలధన వ్యయంతో అధిక ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో సంపద పెంచేందుకు అనే పథకాలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. దీంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉపాధి నైపుణ్య శిక్షణ, ఆయిల్ ఫామ్, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పట్టు పరిశ్రమ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. గిరిజన రైతులకు గిరివికాసం కార్యక్రమం కింద బోరు బావులు, విద్యుత్ మోటార్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 9న ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించే స్థలాన్ని స్థానిక బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు భారీగా తరలి రావాలని కోరారు. వారి వెంట పార్టీ మండల అధ్యక్షులు మెస్రం హన్మంతరావ్, ఎంపీపీ కనక మోతుబాయి, స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

అంగన్‌వాడీ పౌష్టికాహారం ఎంతో మేలు



నవతెలంగాణ-తాంసి

అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని గ్రామసర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్ పిల్లల తల్లులకు గర్భిణులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన హెల్దీ బేబీకి ప్రశంస పత్రాలను పిల్లల తల్లులకు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు చెందిన గర్భిణులు బాలింతలు పోషక ఆహారం తినక అనారోగ్యానికి గురై రక్త హీనత కారణంగా అబార్షన్‌లు జరిగేవని అన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాలు కలిగిన వస్తులను అందించడం జరుగుతుందని అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించి, అరోగ్య వంతంగా ఉన్న పిల్లలకు ప్రశంస పత్రాలను అందించడం జరిగిందని అన్నారు అనంతరం గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్‌కు శాలువాతో సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాంతరెడ్డి అంగన్‌వాడీ టీచర్లు భగిర్త, విటబాయి, విజయ లక్ష్మి, సరిత, అయాలు ఉన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కజ్జర్ల గ్రామంలో జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో గత కొద్ది రోజుల నుండి కీ.శే. చింతలపెల్లి రామకృష్టారెడ్డి జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలను నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి రూ.30వేలు గుడిహత్నూర్, రెండో బహుమతి రూ.15వేలు రామాయి జట్టుకు చింతలపెల్లి దేవారెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె వెంకటమ్మ కిరణ్ కుమార్, ఎంపీటీసీలు ఉడుగు గోదావరి కమలాకర్, నాయకులు వెంకన్న యాదవ్, రమేష్‌రెడ్డి, గణేష్, మహరాజ్ కీపర్ గంగన్న, పోశెట్టి, యువజన సంఘ సభ్యులు క్రీడాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని బాగులవాడ, సోమవార్ పేట్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ గది పరిశీలిస్తూ, విద్యార్థుల హాజరు నమోదు, తాగునీరు, టాయిలెట్స్, తదితర సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సుభాష్‌చందర్ ఉన్నారు.

ఆర్‌బీఐ, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ - రెబ్బెన



మండలంలోని కిష్టాపూర్ గ్రామస్తులకు ఈజీయస్ పని ప్రదేశంలో ఆర్థిక అక్షరాస్యతపై వీఐడీఎస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ బొంగోని రాజశేఖర్, కౌన్సిలర్ తూజి వనజరాణి అవగాహన కల్పించారు. కూలీలకు జన్‌దన్‌ఖాతా, పొదుపు పథకాలు, సామాజిక రక్షణ పథకాలు, వాటివల్ల కలిగే ప్రయోజనాలను, డిజిటల్ బ్యాంకింగ్ ఉపయోగాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కూలీలందరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. సామాజిక రక్షణ పథకాల వల్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని, కుటుంబాలు రోడ్డున పడకుండా సామాజిక రక్షణ పథకాలు కాపాడతాయని తెలిపారు.

అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 05 ఏప్రిల్ 2023

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ

నవతెలంగాణ - రెబ్బెన

ఎంపీడీఓ కార్యాలయంలో వీఓఏలు, సీసీలు, ఎస్ఎస్ఈసీ సభ్యులు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల రాయితీ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల పరిధిలోని 624 సంఘాలకు రూ.71.71 లక్షల రాయితీని గ్రామ సంఘాల వారీగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ హాజరై మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం సెర్ప్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీవో ఎస్ఎస్ నెంబర్ 11 జారీ చేసిన శుభ సందర్భంగా స్థానిక గౌతమి మండల సమాఖ్య డీఆర్‌డీఏ కార్యాలయం ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎంపీడీఓ శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఓ ప్రెసిడెంట్, ఎస్ఈఆర్‌పీ టీసీఎస్ వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు పూర్తి చేయాలి : డీఈఓ



నవతెలంగాణ - సిర్పూర్(టి)

ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగా ప్రధానోపాధ్యాయులు, సంబంధిత కాంట్రాక్టర్లు మన ఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలలో పనులు పూర్తిచేయాలని డీఈఓ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మన ఊరు మన బడి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 18 పాఠశాలల్లో మన ఊరు మన బడి మౌళిక సదుపాయాలు, ప్రహరిగోడ, నీటి వసతి, మూత్రశాలలు, విద్యుత్ పనులకు సంబంధించిన పనులను నిర్లక్ష్యం చేయకుండా గడువు తేదీలోగా పూర్తి చేయాలని తెలిపారు. పనులు పెండింగ్‌లో ఉండకుండా చూడాల్సిన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పనులు నిర్వహించే కాంట్రాక్టర్లు, ఎస్ఎంసీపై ఉంటుందన్నారు. సమన్వయంతో పనులు చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని, నిర్లక్ష్యం వహించకుండా ఈ నెల 31వ తేదీలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమయ్య, సెక్టోరియల్ అధికారి ఎన్ భరత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఎంపీపీ జుమ్మి సౌందర్య పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ - రెబ్బెన

ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీపీ జుమ్మి సౌందర్య పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎంపీడీఓ శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత నమూనా ఎంసెట్‌కు రిజిస్టర్ చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకున్న సైన్స్ విద్యార్థులు ఉచిత నమూనా ఎంసెట్‌కు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఎక్స్‌ప్లోర్ సంస్థ ఆధ్వర్యంలో నమూనా ఆన్‌లైన్ పరీక్షల పోస్టర్‌ను విద్యా శాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారన్నారు. ఈ నెల 5,15, 20 తేదీల్లో మూడు రోజులు ఈ నమూనా టెస్టులు నిర్వహించనున్నారని, విద్యార్థులు తమకు అనుకూలమైన తేదీ, సమయాల్లో ఆన్‌లైన్ టెస్టులకు హాజరు కావచ్చని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లోని ప్రిన్సిపాళ్ల, అధ్యాపకులు విద్యార్థులను నమూనా టెస్టుల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

6న వారసంత వేలం

నవతెలంగాణ - సిర్పూర్(టి)

సిర్పూర్ గ్రామ పంచాయతీ వారసంత వేలం పాట ఈ నెల 6న నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31న వారసంతకు నిర్వహించిన వేలం పాటలో ఇద్దరు మాత్రమే పాల్గొనగా గ్రామ పంచాయతీ సవాల్‌కు గిట్టుబాటు ఆదాయం రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. తిరిగి పైఅధికారుల ఆదేశాల మేరకు 6న నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వేలం పాటలో పాల్గొని వారసంతను దక్కించుకోవాలని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన



నవతెలంగాణ-దండేపల్లి

సిపిఆర్‌పై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి స్థానిక వైద్యాధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సతీష్ సిపిఆర్‌పై మాట్లాడుతూ శరీరంలో అన్ని భాగాలకు విశ్రాంతి ఉంటుంది కానీ, గుండెకు మాత్రం ఉండదని, మనం నిద్రిస్తున్నా గుండె పని చేస్తూ ఉంటుందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గుండెలు ఆగిపోతుండడం, అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టులు, హార్ట్ స్ట్రోక్లు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. చిన్నపాటి మెళకువలు నేర్చుకొని వాటిని పాటిస్తే విలువైన ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. హార్ట్ స్ట్రోక్‌కు గురైనప్పుడు ఎలా స్పందించాలో ఆయన ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, ఎంపీడీవో మల్లేశం, ఐకెపి, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అరటిపండ్లు పంపిణీ



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష పూర్తయిన అనంతరం విద్యార్థులకు జాగృతి మండల కన్వీనర్ నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ విజయ్‌కుమార్ అరటిపండ్లు పంపిణీ చేశారు. పరీక్ష కేంద్రంలో 172 మంది విద్యార్థులకు 167 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఐదుగురు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్, డీఓ రవికుమార్ తెలిపారు. అరటిపండ్ల పంపిణీలో ఎలుకపెల్లి ఉప సర్పంచ్ రమేష్, ముక్త మల్లేష్, రాజన్న, ఉపాధ్యాయుడు శ్రీధర్, సాయిరాం పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

నవతెలంగాణ - రెబ్బెన



మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షానికి మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అసలే అరకొర ఉన్న మామిడి దిగుబడి ఈ అకాల వడగళ్ల వానతో రైతు కోలుకోని విధంగా దెబ్బతిన్నాడు. మరో 20 రోజులు గడిస్తే పంట చేతికొచ్చేది. పంట ఎదుగుదల సమయంలోనే అకాల వడగళ్ల వర్షాలు మామిడి రైతులను నట్టేట ముంచాయి. మండలంలో సుమారు 450 ఎకరాల మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. పక్షం రోజుల క్రితం వచ్చిన వడగళ్ల వర్షానికి సగం మామిడికాయలు నేలరాలాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అది మరువకముందే మంగళవారం కురిసిన వడగళ్ల వర్షానికి పూర్తిగా నేలరాలాయి. మరో 15 రోజులు వడగళ్ల వర్షాలు, గాలులు రాకుండా ఉంటే మామిడి రైతులకు పెట్టుబడైన కొంతవరకు దక్కేదని పేర్కొంటున్నారు. మండలానికి మామిడి రైతు చెందిన భువన్‌సింగ్ మాట్లాడుతూ 50 ఎకరాల్లో మామిడి



తోట ఉండగా, 10 రోజుల క్రితం వచ్చిన గాలి దుమారం, వడగళ్ల వర్షానికి సగం మామిడికాయలు రాలిపోయాయి. మంగళవారం వర్షానికి ఇంచుమించుగా పూర్తిగా మామిడికాయలు రాలిపోయి అపార నష్టం కలిగింది. మామిడి కాయలు నేలరాలడంతో సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లింది. 15 రోజులు గడిస్తే కనీసం పెట్టుబడైనా దక్కేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

టింబర్ యార్డు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని టింబర్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి స్టోర్స్ డివైజిఎం సోమశేఖర్, డివైఎస్ఈ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టింబర్ యార్డ్‌లో పనిచేస్తున్న కార్మికులు 30 సంవత్సరాల నుండి 8 సంవత్సరాల తర్వాత ఒక ఇంక్రిమెంట్ అవకాశం ఉన్నప్పటికీ గతంలో ఏఐటీయూసీ చేసిన అవగాహన లోపం 4 నుండి 5 ఇంక్రిమెంట్లు కోల్పోవడం జరిగిందని పేర్కొన్నారు. టింబర్ యార్డ్‌లో పనిచేసే కార్మికుడు లీవ్ పెట్టుకుంటే కేవలం రూ.800 మాత్రమే చెల్లిస్తున్నారని, కనీసం మొదటి క్యాటగిరి జనరల్ మజ్దూర్‌లకు చెల్లించినట్లుగా రూ.3000 కూడా చెల్లించడం లేదని ఆరోపించారు. నాలుగో కేటగిరి పనులు చేయించుకుంటూ ఒకటవ కేటగిరి యాక్టింగ్‌లు షాప్‌లో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. పీస్ రిలేటెడ్ కార్మికులను ఇంతవరకు జనరల్ మజ్దూర్లుగా మార్పు చేయలేదని, టీబీజీకేఎస్, ఏఐటీయూసీల నిర్లక్ష్యం కారణంగానే టింబర్ యార్డు కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ



కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ జీవన్ జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి, స్టోర్స్ కార్యదర్శి పల్లె క్రాంతికుమార్, నాయకులు నామాల శ్రీనివాస్, ప్రతాప్, ఎల్లయ్య పాల్గొన్నారు.

శివాజీపై దాడిని నిరసిస్తూ కిషన్‌రావ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరే సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీపై దాడి చేసిన మాజీ ఆగ్రో చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద ఆయన దిష్టిబొమ్మ దహనం చేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం మాట్లాడుతూ గత నెల 28న హైదరాబాదులో రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై దాడిని ఖండిస్తున్నామన్నారు. ఇది రాష్ట్ర అధ్యక్షుని ఒకరిపై దాడి జరిగినట్టు కాదని, కులం మొత్తంపైన దాడి జరిగినట్టుగా భావిస్తున్నామన్నారు. శివాజీపై దాడి చేసిన మాజీ ఆగ్రో చైర్మన్‌ను, అతని అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని పోలీస్ శాఖను కోరారు. అలాగే బీఆర్ఎస్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసనకు బిజెపి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరే సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాను పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కాజీ, ప్రధాన కార్యదర్శి సప్త శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు బోర్కుటే తిరుపతి, ప్రధాన కార్యదర్శి నాగపురి మారుతి, డివిజన్ గౌరవాధ్యక్షుడు చౌదరి గోపాల్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడెన్కార్ సంతోష్, సిర్పూర్ డివిజన్ అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకత వార్షిక లక్ష్యాలపై సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట గనిపై 2023-24 వార్షిక సంవత్సరానికి ఉత్పత్తి లక్ష్యాలను, రక్షణ ఆవశ్యతను తెలియజేస్తూ గనిలో వివిధ కేటగిరీలలో ప్రమోషన్లు పొందిన వారికి మంగళవారం ప్రమోషన్ పత్రాలను గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, మేనేజర్ అల్లావుద్దీన్ అందజేశారు. అనంతరం రక్షణ అధికారి మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి రక్షణతో పని చేయాలన్నారు. గని మేనేజర్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ గతంలో వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడానికి వెనుకబడి ఉన్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గని లక్ష్యాన్ని చేరుకునేందుకు అందరు కృషి చేయాలని తెలిపారు. కాసిపేట గ్రూప్ ఏజెంట్ రాజేందర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం కాసిపేట గనితోపాటు కాసిపేట-1 టన్నల్ పనులు మొదలవుతాయన్నారు. గనికి 2,40,000 టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా ఇవ్వడం జరిగిందన్నారు. గనిలో వివిధ కేటగిరీలలో ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ బైరి శంకర్, ఏరియా కార్యదర్శి వడ్లాల రాజన్న, ఏఐటియుసి నాయకులు



మీనుగు లక్ష్మినారాయణ, రక్షణాధికారి సునీల్ కుమార్ బాబు, మధుకర్, డిప్యూటీ మేనేజర్ నిఖిల్, వెంకటేష్, సర్వేయర్ వెంకటేశ్వర్లు, సంక్షేమ అధికారి మీర్జాజిగౌస్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సై వెంకటేష్ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. వేసవికాలం కావడంతో మారుమూల గ్రామల నుంచి వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాథోడ్ ఉత్తం నాయక్, ధనోర ఉప సర్పంచ్ రిజ్వాన్, మాజీ ఎంపిటిసి గోగర్ల రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తాలో పోలీసు మీ కోసంలో భాగంగా కౌటాల సిఐ సాదిక్ పాషా, ఎస్సై విజయ్ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవికాలంలో సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు డుబ్బుల వెంకన్న, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ నాజీమ్ హుస్సేన్, ఆరె కుల మండల అధ్యక్షులు శ్రీనివాస్, బౌద్ధ సంఘ సభ్యులు సదాశివ్, రత్నం పాపయ్య, హరీష్, తిరుపతి పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్ పెండ్లి రోజు వేడుకలు

నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం డాక్టర్ భీంరావు అంబేద్కర్ రమాబాయి 117వ పెళ్లి రోజు ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలతో సత్కరించి మిఠాయిలు పంచి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బౌద్ధ బిక్షులు, సిర్పూర్ తాలూకా బౌద్ధ సంఘ తాలూకా అధ్యక్షులు బసర్కార విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను ఏకతాటిపై తీసుకొచ్చి, దేశానికి రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కల్పించారని తెలిపారు. ప్రజల వద్ద పాలన నినాదంతో ముందుకు తీసుకెళ్లిన పుణ్య దంపతులని తెలిపారు. అంబేద్కర్, రమాబాయిని ఆదర్శంగా తీసుకొని అడుగుజాడల్లో నడవాలని అన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ తాలూకా సంయుక్త కార్యదర్శి డోంగ్రి సదాశివ్,



ప్రచార కార్యదర్శి శ్యామ్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి రత్నం పాపయ్య, హరీష్ చేతన్, తిరుపతి, విలాస్, విజయ్ బౌద్ధ బాంధవులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు అందుకున్న శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

ఇందారం గ్రామానికి చెందిన చిప్పకుర్తి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని జేఎన్టీయూ నెహ్రూ గ్యాలరీలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనలో శ్రీనివాస్ గీసిన చిత్రాన్ని ప్రదర్శించారు. ప్రముఖ చిత్రకారులు శేష బ్రహ్మం ఆధ్వర్యంలో కళాయజ్ఞం పేరుతో నిర్వహించిన చిత్ర ప్రదర్శనలో శ్రీనివాస్ గీసిన చిత్రానికి జాతీయ స్థాయి కళాయజ్ఞ మోస్ట్ ప్రామిసింగ్ అవార్డును అందజేశారు. ప్రముఖ చిత్రకారులు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి చేతుల మీదుగా చిప్పకుర్తి శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. అవార్డు గ్రహీత చిప్పకుర్తి శ్రీనివాస్ కుందారం ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని శ్రీనివాస్ తెలిపారు. చిత్రకారుల కళానైపుణ్యాన్ని ప్రదర్శించడం కోసం ప్రముఖ చిత్రకారులు శేష బ్రహ్మం ఎంతో శ్రమించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆయనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

5న ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 5న ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, నాయకులు వడ్లకొండ ఐలయ్య, భేతి భరత్, జోరుక వెంకటేష్, సంకె వెంకటేష్, సంజీవ్ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2011 నుండి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వకుండా, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా తీరని అన్యాయం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని తెలిపారు. కార్మికులకు, ఉద్యోగులకు ఇన్‌కంటాక్స్ విషయంలో ఏమాత్రం రాయితీ కల్పించలేదని తెలిపారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా 5న ఢిల్లీలో జరిగే ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

6న సింగరేణి విశ్రాంత ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెంపు, ఉచిత వైద్య సౌకర్యం, ఉచిత క్వార్టర్స్ పంపిణీ, 200 గజాల ఇంటి స్థలం, గ్రాట్యూటీ చెల్లింపులో జరుగుతున్న అన్యాయాలపై ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి సింగరేణి వ్యాప్తంగా ఉన్న విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు అత్యధికంగా హాజరు కావాలని కోరారు. హైదరాబాద్‌లోని సోయబ్ హాల్ (సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్‌లింగంపల్లి)లో మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభించన్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో మంగళవారం వేణుగోపాల్ స్మారక ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఏరియా జీఎం జి దేవేందర్ ప్రారంభించారు. మొదటగా ఒలంపిక్ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని 12జట్లు పోటీల్లో పాల్గొననున్నాయని తెలిపారు. విద్యతో సమానంగా క్రీడల్లో రాణిస్తే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన క్రీడా ఫుట్‌బాల్ అని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల కోసం క్రీడాకారులకు ఉచిత వసతి భోజన సదుపాయం కల్పించామని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో పోటీలు సజావుగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కెహెచ్ఎన్ గుప్తా, టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, స్పోర్ట్స్ పర్యవేక్షకులు సుందర్‌రాజు, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి జీకే కిరణ్‌కుమార్, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి చాట్ల అశోక్, స్పోర్ట్స్ సమన్వయ కర్త చంద్రకుమార్ పాల్గొన్నారు.

ఐకే1ఏ గని సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్ ఏరియా పరిధి ఇందారం-1ఏ గని సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా డిమాండ్ చేశారు. పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డితో పాటు మంగళవారం సెకండ్ షిఫ్టులో గని కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. రహదారి నిర్మాణపు పనులు పూర్తి చేయకపోవడంతో కార్మికులకు ఇబ్బందిగా మారిందని, నిలిపి వేసిన రహదారి నిర్మాణపు పనులు వెంటనే ప్రారంభించాలని అన్నారు. గని వద్ద గల క్యాంటీన్‌లో నాణ్యత లేని అల్పాహారం అందిస్తున్నట్లు కార్మికుల ద్వారా తెల్సుకున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల సౌకర్యార్థం భోజనశాల, బైక్ షెడ్, మరుగుదొడ్ల మరమ్మత్తులు త్వరితగతిగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గని ప్రధాన రహదారిలో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగభూషణం, గండి సతీష్, మధూకర్, సురేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పంట నష్టం పరిహారం అందించాలి

నవతెలంగాణ-బోథ్

పంట నష్ట పరిహారం అందించాలని మంగళవారం కనుగుట్ట గ్రామ రైతులు స్థానిక తహసీల్దార్ అతికొద్దీన్‌ని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలతో మొక్కజొన్న పంట గాలివానకు కింద పడిపోవడంతో స్థానిక వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. ఎప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు ప్రభాకర్, ఆశన్న, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి టి.దుర్గారాణి అన్నారు. ఆమె మంగళవారం మండల కేంద్రంలోని మెండాపల్లి వద్ద ఉన్న గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల కళాశాలను సందర్శించారు. వంట గదులు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రోజు వారిగా తాజా కూరగాయలను వాడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎస్ఓ శ్రీప్రియ, స్థానిక ఎస్సై డి సునీల్ ఉన్నారు.

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

● పసికందును వదిలి మృత్యుఒడిలోకి..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, నార్నూర్

ఇరవై ఐదు రోజుల కిందనే పండంటి బిడ్డకి జన్మనిచ్చి తల్లి, భర్త వరకట్న వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుంగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సుంగాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన వివాహిత నెల పసికందును వదిలి భర్త వరకట్నం వేదింపులకు తాళలేక సోమవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు దారి తీసిన ఘటన కలకలం రేపింది. సుంగాపూర్ గ్రామానికి చెందిన భండారే ఐశ్వర్య(20)కు జున్ని గ్రామానికి చెందిన మహేష్‌తో గత ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివాహం చేశారు. భర్త మహేష్ యాపల్‌గూడ పోలీస్ బెటాలియన్‌లో



కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారు జిల్లా కేంద్రంలో టీచర్స్ కాలనీలో నివసిస్తున్నారు. ఐశ్వర్య ప్రసవానికి సుంగాపూర్ గ్రామంలో తన తల్లి ఇంటికి వచ్చింది. ఇరవై రోజుల కింద మగశిశువుకు జన్మనిచ్చింది. భర్త తరచుగా రూ.10 లక్షలు కావాలని, వరకట్నం కోసం వేధింపులు చేసేవాడు. తల్లి అంగన్‌వాడీ ఉద్యోగం చేస్తూ, ఇద్దరు చెల్లెండ్లను ఓ తమ్ముడిని పోషిస్తుంది. ఐశ్వర్య భర్త వరకట్న వేదింపులకు తాళలేక ఇరవై రోజుల పసికందును వదిలి సోమవారం సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రెఫెర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రేమ్ కుమార్ తెలిపారు.

రిమ్స్ ఎదుట కుటుంబీకుల రాస్తారోకో...

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఇరవై ఐదు రోజుల క్రితమే పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత వరకట్న వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడడంతో బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. రిమ్స్ ఎదుట పాత జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆమె ఆత్మహత్యకు బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ రాస్తారోకో



చేపట్టడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. అయిన వారు వినిపించుకోకుండా అక్కడే భీష్మించుకుని కూర్చున్నారు. నార్నూర్ మండలంలోని సుంగాపూర్ గ్రామానికి చెందిన ఐశ్వర్యకు యాపల్‌గూడ 32 బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహేష్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో 22 లక్షలు కట్నం ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. తొలుత పది లక్షల కట్నం ఇచ్చి వివాహం జరిపించారు. అయితే ప్రసూతి కోసం పుట్టింటికి వచ్చిన ఐశ్వర్యను భర్త మహేష్ నిత్యం కట్నం కోసం వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టాడు. ఇది తాళలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. బాధ్యుడిపై చర్యలు తీసుకుని తగిన న్యాయం చేయాలంటూ ఆమె కుటుంబీకులు వేడుకున్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం చేపట్టిన రెండో విడుత కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మంగళవారం హమాలీవాడ, భుక్తాపూర్ వార్డుల్లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నయా పైసా ఖర్చు లేకుండా అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో అంధత్వ నివారానికై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు. ఈ శిబిరానికి హాజరైన వారికి నిర్వహించిన కంటి పరీక్షలు, మందులు, కండ్లాద్దాల పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్లు బండారి సతీష్, డాక్టర్ లక్ష్మణ్ ఉన్నారు.

ఉద్యోగులను సన్మానించిన టీఎన్జీవోస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఆదిలాబాద్ టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సంద అశోక్, ఏ.నవీన్ కుమార్‌లు అన్నారు. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖలో పదోన్నతులు పొందిన జి.గోపి, మహేందర్, తమ్మల గోపిలను టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

రెండో రోజు పది పరీక్షకు 48 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు పరీక్షకు మొత్తం 10,605 విద్యార్థులకు గాను 10,557 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత పేర్కొన్నారు. 48 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని మహావీర్ భవనంలో జైన్ సమాజ్ ఆధ్వర్యంలో మహావీర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మహావీర్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ప్రత్యేక హారతులు అందచేసి భక్తి గీతాలు పాడుతూ భక్తి భావాన్ని చాటారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలి నిర్వహించారు. భక్తి గీతాలను ఆలపిస్తూ, మహావీర్ భోధనలను స్మరిస్తూ ర్యాలిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాజ్ ప్రతినిధులు మాట్లాడుతూ మహావీర్ జయంతి విశిష్టతను తెలియచేశారు. బతుకు, బతకనివ్వు అని ఆయన చేసిన సందేశంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, జయంతి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైన్ సమాజ్ అధ్యక్షులు అజయ్, విశ్వక్, నరేందర్ చౌదరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కుప్టి బ్రిడ్జి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నేరడిగొండ మండల వాసి రాథోడ్ లచ్చిరాం(57) రానాపూర్‌కు చెందిన పట్వారి సీతారాం ఇద్దరు కలిసి ఇచ్చోడ మండలానికి వెళ్లారు. పని ముగించుకొని నేరడిగొండకు తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం వెనుక నుండి వేగంగా ఢీకొట్టింది. దీంతో లచ్చిరాం నాయక్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంట ఉన్న సీతారాం నాయక్ గాయాలతో బటయపడ్డాడు. కేసు నమోదు చేసుకుని గుర్తుతెలియని వాహనం కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

108లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గ్రామపంచాయతీలోని కొత్తపేట గ్రామానికి చెందిన మర్సుకోల సుఖదేవి మంగళవారం 108 వాహనంలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పైలట్ ఎండి రఫీక్ తెలిపిన వివరాల ప్రకారం..సుఖదేవి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ఈఎంటి మునీందర్‌గౌడ్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం సీఐ శ్రీనివాస్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు గ్రామాల నుండి వచ్చే ప్రజలకు, ప్రయాణికులకు దాహార్తి తీర్చుకోవడానికి చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా మునావర్ షరీఫ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ప్రమోద్ జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయిన విషయం తెల్సిందే. కౌటాల తహసీల్దార్‌గా పని చేస్తున్న మునావర్ షరీఫ్‌ను గత నెల 23న ఇక్కడికి బదిలీ చేయగా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం అధికారులు, సిబ్బంది, మీ సేవా సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జాబ్‌మేళాకు స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టైమ్స్ ప్రో వారి సహకారంతో ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాల భర్తీ కోసం మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. మొత్తం 40 మంది విద్యార్థులు హాజరు కాగా వీరికి తొలి దశ పరీక్ష నిర్వహించారు. తదుపరి దశను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించి ఎంపికైన వారికి నియామకపత్రాలు అందించనున్నట్లు టైమ్స్‌ప్రో ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం మాట్లాడుతూ త్వరలో మరికొన్ని కంపెనీల సహాయంతో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టైమ్స్‌ప్రో ప్రతినిధులు కుమార్, ప్రణయ్, అధ్యాపకులు ఎం రాజేశ్వర్, వి దేవేందర్, ఇ శారద పాల్గొన్నారు.

ప్రార్థనల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న వారికి ప్రార్థనల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కేఆర్‌కే కాలనీలోని మదీనా మసీదు వద్ద సమస్యలున్నాయని మసీదు కమిటి సభ్యులు విన్నవించగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి మసీదును సందర్శించి, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్డుపై నీరు నిలవడంతో బురద పేరుకుపోతోందని సభ్యులు చైర్మెన్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి మొరం వేయించారు. అనంతరం తడి, పొడి చెత్త సేకరణ కోసం డస్ట్ బిన్‌లను పంపిణి చేశారు. ఈ మున్సిపల్ చైర్మెన్ వెంట మసీద్ కమిటి అధ్యక్షుడు సాదుల్లా, ఇమామ్ ఇనాయత్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లోని డైస్ కేంద్రంలో ఆర్వీఎస్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. మంగళవారం అపోలో ఆస్పత్రికి చెందిన చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ అముల్ గుప్తా, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సతీష్‌లు శిబిరంలో చిన్నారులను పరీక్షించారు. ఆదిలాబాద్ జిల్లాలోని చిన్న పిల్లలు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, చికిత్సలు చేయలేని పేదల కోసం తమ ఆస్పత్రి ద్వారా ఉచితంగా సేవలను అందిస్తామని అపోలో వైద్యుడు అమూల్ గుప్తా తెలిపారు. ఇక్కడ నిర్వహించిన వైద్య శిబిరానికి అనేక మంది వచ్చారని వారిని పరిక్షించి అవసరమైన వారికి తమ ఆస్పత్రికి రేఫర్ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, డైస్ మెడికల్ సుబియ, డెంటల్ వైద్యురాలు రాధిక, మేనేజర్ జైవిన్ నాయక్, సిబ్బంది నాగర్జున్‌రెడ్డి, దొంతుల ప్రవీణ్, ప్రశాంత్, ఉమకాంత్ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ప్రకృతి పర్యావరణం అంశంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పక్షి ప్రేమికులు జక్కుల వెంకటేష్, సహాయకులు రమణ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పక్షులు, పశువులు, మొక్కలకు నీరందించేందుకు కృషి చేయాలని, బర్డ్ ఫీడర్లను ఏర్పాటు చేసి పక్షులకు ఆహారాన్ని అందించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణలో నీటి తొట్టెలు, ఆహార ఫీడర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పక్షి ప్రేమికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

నవతెలంగాణ - రెబ్బెన

మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షానికి గోలేటి గ్రామంలో ప్రధాన రహదారిపై 33కేవీ విద్యుత్ స్తంభంపై చెట్టు కొమ్మ విరిగి పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే సమాచారం అందుకున్న ఏఈ ఇర్ఫాన్ విద్యుత్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్తంభంపై విరిగిపడిన చెట్టును తొలగించి విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి

● మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో రాజరాజేశ్వర పంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 75 ఏండ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని, అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఊహించని విధంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఎన్నికల మెనిఫెస్టోతో సంబంధం లేకుండా సీఎం కేసీఆర్ ప్రజల అవసరాలను గుర్తించి, కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఆసరా పెన్షన్లను భారీగా పెంచారు. ఎవరూ అడుగని రైతుబంధు, రైతుబీమా నుంచి గీత, చేనేత కార్మికులకు పింఛన్లు, రజక, నాయిబ్రాహ్మణ దుకాణాలకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు సన్న బియ్యం, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి ఇలా ఎన్నో పథకాలు ప్రజలకు అందుతున్నాయని అన్నారు. వృత్తుల వారీగా కూడా ఆర్థిక భరోసా కల్పించేందుకు గొర్రెలు, చేప పిల్లల పంపిణీ వంటి వినూత్న పథకాలు అమలులో చేస్తోందని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఆయా విభాగాల ద్వారా ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, పార్టీ మండల ఇన్‌చార్జీ అల్లోల మురళీధర్ రెడ్డి,రైతు బంధు జిల్లా అధ్యక్షులు, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఆశ్రిత శ్రీనివాస్ రెడ్డి, అడెల్లి చైర్మెన్ అయిటి చందు, సొసైటీ చైర్మెన్‌లు నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మాధవ్ రావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మధుకర్ రెడ్డి, ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

లీకేజీ ఘటనపై కేసీఆర్, విద్యాశాఖ మంత్రి స్పందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారుల లోపం స్పష్టంగా కనబడుతుందని, పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలని పీడీఎస్‌యూ సంఘం జిల్లా అధ్యక్షులు సిడం సాయికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూర్‌లోని ఒక పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్ష పేపర్ లీకేజీ ఘటనలపై అనేక అనుమానాలు, అభియోగాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. అదే సమయంలోనే ఉట్నూర్ మండలంలో టెన్త్ పరీక్ష జవాబు పత్రాలు మాయం కావడం అనేది పూర్తిగా రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యమే అన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సొంత జిల్లా అక్కడ తనకు కావాల్సిన కుటుంబాల విద్యార్థులకు అధిక మార్కులు రావడం కోసం 9:30 నిమిషాలకు పరీక్షలు ప్రారంభం అయితే 9 : 37 కు ప్రశ్నపత్రం బయటకు వచ్చిందని అంటే కనీసం పరీక్షలు ప్రారంభమై 10 నిముషాలు కూడా కాకుండానే బయటకు రావడం అంటే ఉద్యేశ పూర్వకంగానే లీక్ చేశారేమోనని అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. ఇంత త్వరగా వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొట్టడం వంటి విషయాలను చూస్తే ప్రణాళిక బద్దంగానే పేపర్ లీక్ అయిందన్నారు. టీఎస్‌పీఎస్సీ పరిధిలోని పేపర్ లికేజీ వ్యవహారం ఇంకా మరవక ముందే దానికి సంబందించి విచారణ కొనసాగుతున్న



నేపథ్యంలో తాగజా పదో తరగతి పేపర్ లీక్ అంటే విద్యాశాఖ, లేక ప్రభుత్వమే లికేజీల ప్రభుత్వమా అని ప్రశ్నించారు. పేపర్లు లీక్ చేసి అమ్ముకున్న అసలు నేరస్థులను వెలకితీయాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, దీనికి విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కుమ్ర అశోక్, నాయకులు శ్యాంసుందర్, రజినీకాంత్, రవి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి విద్యా శాఖ కమీషనర్ వాకాటి కరుణతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ, పదోతరగతి పరీక్షల నిర్వహణలో ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. పరీక్షల నిర్వహణను ఆయా కేంద్రాల వద్ద ఎన్నికల ప్రక్రియ మాదిరిగా కట్టుదిట్టంగా 144 సెక్షన్ అమలు, బందోబస్తుతో నిర్వహించాలని అన్నారు. పరీక్షా అనంతరం జవాబు పత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించాలని అన్నారు. పరీక్షా కేంద్రాలలోకి ఇతరులను అనుమతించవద్దని, సెల్ ఫోన్, స్మార్ట్ వాచ్‌లు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి అనుమతించవద్దని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఉట్నూర్ ఘటన పునరావృతం కాకుండా జవాబు పత్రాలను తరలించే సమయంలో పోస్ట్ ఆఫీస్ నుండి ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత, ఆర్టీసీ డిఎం కల్పన, తపాలాశాఖ అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్ (జి) రైతు వేదికలో మంగళవారం ఎంపీపీ కోండ్ర రేఖా రమేష్‌ల అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హజరై తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కొందరు అధికారులు పూర్తి సమాచారం లేకుండానే గైర్హజరయ్యారని, తరువాత సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. టెంబుర్ని, బూరుగుపల్లి, కుప్లి, అంజని తండ, నందన్, బామ్ని(బి) గ్రామాలకు నూతన పంచాయతీ కార్యాలయాల మంజూరైనట్టు వాటిని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రం నుంచి గొల్లమాడకు ఆర్టీసీ బస్సు నడపాలని సర్పంచ్ మహేష్ ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టమ్ సరిగా లేని కారణంగా సభ్యులకు అధికారులకు సమన్వయం లోపించింది. దీని కారణంగా సమావేశంలో చర్చించిన అంశాలు సభ్యుల వరకు చేరలేదని పలువురు ఆరోపించారు. ఈ సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ చిన్న



రామయ్య, బన్సపల్లి ఎఫ్ఎస్సీఎస్ చైర్మెన్ రమణారెడ్డి, ఎంఆర్ఓ శ్రీకాంత్, ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు రాంరెడ్డి, జి.సురేష్, చెన్న మహేష్, ఎస్ దత్తు, రజిని సుధాకర్, స్వరూప భూమేష్, నస్రీన్ బేగం, పుష్పల పోశెట్టి, ఒడ్నం అశ్విని ఎంపీటీసీలు పాల్గొన్నారు.